బాల్య వివాహాలను అరికడదాం

విశాలాంధ్ర-అచ్యుతాపురం: బాల్య వివాహాలను అరికట్టడాన్ని ప్రతిఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని సామాజిక కార్యకర్త రమ్య అన్నారు . మంగళవారం ఎం. జగన్నాధపురం గ్రామంలో విలేజ్ చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ కమిటీలను నియమించారు . ఈ కమిటీకి సర్పంచ్ కరెడ్ల బుల్లెమ్మ అధ్యక్షతన మహిళా పోలీస్ గీతాంజలి ఆధ్వర్యంలో నెలకు రెండు సార్లు కమిటీతో సమావేశం నిర్వహిస్తారన్నారు. బాల్యవివాహాలు జరగకుండా చూడాలని కమిటీ సభ్యులకు తెలిపారు . ఈ సందర్భంగా గ్రామాల్లో కమిటీలు చేయాల్సిన విధి విధానాల గురించి వివరించారు . ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ కరెడ్ల సూర్యప్రకాష్ మాట్లాడుతూ గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు . ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సేనాపతి వెంకటేష్ , ప్రధానోపాధ్యాయులు రవికుమార్ , పంచాయతీ కార్యదర్శి రవిరాజ , వీఆర్వో గౌరీ , విసం నానాజీ పాల్గొన్నారు

రెవిన్యూ సేవలలో జాప్యం ఉండరాదు

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

పేదవారికి ఉచిత విద్యుత్ పంపిణీకి సోలారు యూనిట్ల ఏర్పాటు

విశాలాంధ్ర -అనకాపల్లి కలెక్టరేట్: రెవిన్యూకు సంబంధించిన సేవలలో జాప్యం ఉండకూడదని, సేవలకు సంబం ధించిన ధరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. బుధవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంనుండి రెవిన్యూ శాఖకు సంబంధించిన రీసర్వే, మ్యుటేషన్లు, ఇంటిస్థలాలు క్రమబద్ధీకరణ, నీటితీరువా వసూలు తదితర అంశాలపై తహశీల్దార్లతో జిల్లా కలెక్టరు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ సమీక్ష నిర్వహిస్తూ రెవిన్యూ సేవలకు సంబంధించిన ధరఖాస్తులపై గడువులోపల చర్యలు తీసుకోవాలని తెలిపారు. రీసర్వే పనులు వేగవంతం చేయాలని తెలిపారు. కొన్ని మండలాలలో ఆటో మ్యుటేషన్లు పెరగడం, ఎక్కువ మ్యుటేషన్లను తిరస్కరించడంపై నివేదిక అందజేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. దీనిపై రెవిన్యూ డివిజినల్ అధికారులు రోజువారీ పర్యవేక్షణచేసి నివేదిక అందించాలని తెలిపారు. అభ్యంతరం లేని ప్రభుత్వ భూములలో తేది.15.10.2019 నాటికి ఇళ్లు కట్టుకొని, ప్రస్తుతం నివాసముంటూ, ఇంటికి సంబంధించిన ఆధార పత్రాలు కలిగి, ఎక్కడా ఇళ్లు లేని వారికి ప్రభుత్వం కల్పించిన క్రమబద్ధీకరణ పథకానికి సంబంధించిన ధరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. కొత్తగా ఇంటి స్థలాలకొరకు ధరఖాస్తు చేసుకొన్నవారికి కేటాయించుటకు ప్రస్తుతం గల లేఅవుట్ లలో అందుబాటులో గల స్థలాల వివరాలు సేకరించి సిద్దంగా ఉంచుకోవాలన్నారు. రీ-సర్వే కు సంబంధించి వివరాలు నమోదు, హద్దులు నిర్ణయం భూయజమానులు సమక్షంలోనే చేయాలని, భూమిలేనివారికి భూమిఉన్నట్లు నమోదు చేసిన యెడల కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయకట్టు భూములకు నీటితీరువా వసూలు చేయాలని, జిల్లాలో సుమారు 17కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని, వారం రోజులలో వసూలుపూర్తి చేయుటకు చర్యలుతీసుకోవాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి పెండింగు లేకుండా వెంటనే కోర్టులలో కౌంటర్లు దాఖలుచేయాలని జిల్లా కలెక్టరు తెలిపారు. సమాచార హక్కుచట్టం ద్వారా వచ్చే దరఖాస్తులకు మీ దగ్గర గల సమాచారాన్ని వెంటనే గడువులోపల అందించాలన్నారు. పదవీ విరమణ చేయుచున్న ఉద్యోగులకు సంబంధించిన పెన్షను ప్రపోజల్స్ ముందుగానే పంపించాలని, వారికి అందించ వలసిన ఆర్థిక ప్రయోజనాలను పదవీవిరమణ రోజునే అందించి, గౌరవప్రదంగా సాగనంపేలా చర్యలు తీసుకోవాలని తెలియజేసారు. జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చాలని, అందుకుగాను నాటుసారా కు సంబంధించిన సమాచారాన్ని గ్రామ అధికారులు ఎక్సైజ్ శాఖకు అందించాలని, ఎక్సైజ్ శాఖ వారు దాడులు చేసినప్పుడు వారికి సహకరించాలని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం ఉచిత విద్యుత్ పొందుతున్న ఎస్.సి., ఎస్.టి. వినియోగదారులకు ఉచిత కరెంటు అందించుటకు వారి ఇంటిపై సోలారు యూనిట్లు ఏర్పాటుచేయాలని, స్థలంలభ్యత లేని వారికి సరఫరాకు ఎపిఇపిడిసిఎల్ ద్వారా సోలారు యునిట్ ఏర్పాటుకు కనీసం 50సెంట్లు ఉండేవిధంగా భూమిని గుర్తించి వివరాలు అందించాలని తెలిపారు. అందుకుగాను లేఅవుట్ లలో సామాజిక అవసరాలకు విడిచిపెట్టిన స్థలాలను కూడా పరిశీలించాలని కలెక్టరు పేర్కొన్నారు.జాయింటు కలెక్టరు ఎమ్.జాహ్నవి మాట్లాడుతూ రెండవ విడత రీసర్వే చేపడుతున్న గ్రామాలలో గ్రామసభలు నిర్వహించాలని, రీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముందుగా భూయజమానులకు నోటీసులు అందజేయాలని తెలిపారు. సర్వేకు అదనపు సిబ్బంది అవసరమైతే కేటాయించడం జరుగుతుందని తెలిపారు. వార్తాపత్రికల లో వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే చర్యలు తీసుకొని, నివేదికను అందజేయాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, సర్వే లేండు రికార్డు సహాయ సంచాలకులు గోపాలకృష్ణ, కె.కె.ఆర్.సి. స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎస్.వి.ఎస్. సుబ్బలక్ష్మి, జిల్లా పౌర సరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎన్. మూర్తి, ఆర్.డి.ఒ.లు, కలెక్టరు కార్యాలయ సూపరింటెండెంట్ లు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

ప్రత్యేక 'శక్తి టీమ్స్ ఏర్పాటు : ఎస్పీ తుహిన్ సిన్హా

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: మహిళలపై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపులను నియంత్రించేందుకు, మహిళలకు రక్షణగా నిలిచే చట్టాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'శక్తి' యాప్ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యేకంగా శక్తి టీమ్స్ ను నియమించామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శక్తి టీమ్స్ నిర్వర్తించే విధులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై బుధవారం దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ. రాష్ట్రంలో మహిళల పట్ల ఎటువంటి దాడులు, అఘాయిత్యాలు, వేధింపులు లేకుండా చేసేందుకుగాను ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో 'శక్తి టీమ్స్' ను జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ శక్తి టీమ్స్ జిల్లాలోని కళాశాలలు, ముఖ్య కూడళ్ళను (హాట్ స్పాట్స్ ను) మఫ్టీలో సందర్శించి, మహిళలను వేధించే ఆకతాయి లను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు చేపడతరన్నారు.దీనిలో భాగంగా జిల్లాలో అనకాపల్లి, పరవాడ మ నర్సీపట్నం పట్టణాలలో ఆరుగురు పోలీసు సిబ్బందితో ఐదు బృందాలుగా మొత్తం 30 మందితో శక్తి టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఒక్కొక్క బృందానికి ఎస్సై నాయకత్వం వహిస్తారన్నారు. ఈ బృందాలు మఫ్టీలో విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఆపద సమయంలో



శక్తి యాప్ కు వచ్చే ఎస్.ఓ.ఎస్.కాల్స్, డయల్ 112/100 కాల్స్ వచ్చిన వెంటనే శక్తి బృందాలు అప్రమత్తమై సకాలంలో సంఘటనా స్థలంకు చేరుకొని సమస్యలను చట్టబద్ధంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా శక్తి టీమ్స్ ను ఆదేశించారు.ఈ బృందాల పని తీరును జిల్లాలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ పర్యవేక్షిస్తారని, మహిళా పి.ఎస్ డీఎస్పీ ఇ.శ్రీనివాసులు నోడల్ అధికారిగా ఉంటారన్నారు. అంతేకాకుండా, శక్తి టీమ్స్ ను రాష్ట్ర డిజిపి కార్యాలయం కూడా పర్యవేక్షిస్తుందని, వారి ఆదేశాల మేరకు పనిచేయాల్సి ఉంటుందని ఎస్పీ తుహిన్ సిన్హా శక్తి టీమ్స్ కు దిశా నిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, మహిళా పి.ఎస్ డీఎస్పీ ఇ.శ్రీనివాసులు, సి.ఐ చంద్రశేఖర్, ఎస్సై మనోజ్ కుమార్, శక్తి టీమ్స్ సభ్యులు పాల్గొన్నారు.

రూ.34లక్షలతో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర -రోలుగుంట: మండలంలో కొండపాలెం గ్రామ పంచాయతీ వెలంకాయల పాలెంలో రూ.34లక్షలతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు బుధవారం శంకుస్థాపన చేశారు. స్థానిక ఎంపీపీ పాఠశాల నిర్మాణానికి ఎస్ఎస్ఏ నుంచి రూ.13లక్షలు, గ్రామంలో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు జలజీవన్ మిషన్ కింద రూ.21 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు సర్పంచ్ బంటు చిరంజీవి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు.

రైల్వే ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర-పరవాడ: రైల్వే ఉద్యోగాలకు సిద్దమయ్యే అభ్యర్థులకు రామ్‌కీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ (గ్రీన్‌ల్యాండ్స్) సంస్థలు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు ఎం.వి.రామిరెడ్డి, గద్దె భాస్కర్, ప్రొఫెసర్ లక్ష్మీకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు గ్రూప్ డి పరీక్ష ద్వారా ఖాళీలు భర్తీ చేయనున్న నేపథ్యంలో నిరుద్యోగ యువతకు ఇదో సువర్ణావకాశమని వారు పేర్కొన్నారు. ఈ శిక్షణ కోసం ఈ నెల 5వ తేదీన రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయం సాధించిన అభ్యర్థులకు శ్రీధర్ సీసీఎఫ్ సంస్థ నేతృత్వంలో 3,4 నెలలపాటు హైదరాబాదులో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. అభ్యర్థులకు శిక్షణతోపాటు వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇస్తారని చెప్పారు. రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ, కర్నూలు కేంద్రాల్లో వంద మార్కులకు నిర్వహించే అర్హత పరీక్షను 90 నిమిషాల్లో రాయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ టెలిగ్రామ్ గ్రూప్‌ను ఫాలో కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఈ ఫోన్ నెంబర్ 9515658033లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

పాయకరావుపేటలో ఆటిజం అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-పాయకరావుపేట: ఆటిజం ఎవేర్నెస్ డే పురస్కరించుకుని స్థానిక పీహెచ్ వాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవిత సెంటర్ నందు ఆటిజం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆటిజం రావడానికి గల కారణాలు, ఆటిజం ఎలా గుర్తించాలి, ఎలా వస్తుంది, నివారణ మార్గాలు అనేవి వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి జి. రమేష్ బాబు హాజరయ్యారు. ర్యాలీలో పాఠశాల హెచ్ఎం అనంతలక్ష్మి, ఉపాధ్యాయులు అప్పలనాయుడు, శ్రీను, విజయ్ కుమార్, క్రాంతి కుమారి, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మిడతాడ కుటుంబ సభ్యులను పరామర్శించిన మాడుగుల ఎమ్మెల్యే బండారు

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి గ్రామానికి చెందిన మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మిడతాడ మహాలక్ష్మి నాయుడు సోదరులు మిడతాడ అప్పలనాయుడు (బుర్రకథ అప్పలనాయుడు) మార్చి నెల 30 న హాస్పటల్లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆ విషయం తెలుసుకొని మాజీ మంత్రి, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆయన స్వగ్రామానికి బుధవారం వెళ్లి మహాలక్ష్మి నాయుడు సోదరుడు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు . ఈ కార్యక్రమంలో రొంగలి దేముడు బాబు, బోకం జోగినాయుడు, లాలం సింహాచలం నాయుడు, సబ్బవరపు నాయుడు, సబ్బవరపు నరసింహమూర్తి , కిల్లి సత్యనారాయణ, బోకం శ్రీనివాసరావు, వనం సూర్యనారాయణ, అంతకాపల్లి టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

3 లక్షల ఎంపీటీసీ నిధులతో శ్మశాన వాటిక అభివృద్ధి

విశాలాంధ్ర-మునగపాక: మండలంలో తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లి శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఎంపీటీసీ నిధులు రూ.3 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో గవర్ల అనకాపల్లి శ్మశాన వాటికలో సీసీ ప్లాట్ఫారం వేయనున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి,వైసీపీ నాయకులు షేక్ ఇస్మాయిల్,కూటమి నాయకులు,పంచాయతీ వార్డ్ మెంబర్స్,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నక్కపల్లి వారపు సంతలో భారీ అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర-నక్కపల్లి : నక్కపల్లి జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న వారపు సంత బుధవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదానికి గురైంది. ఒక్కసారిగా అగ్ని మంట ఒక పాక దగ్గర మొదలై వీస్తున్న గాలికి సంతలో ఉన్న 55 పాకలను ఒకేసారి చుట్టేసింది. సుమారు 15 లక్షలు ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చు అంచనా వేస్తున్నారు. సంతను అనుకొని పక్కనే ఉన్న అగ్నిమాపక కేంద్రంలో అందుబాటులోకి వాహనం లేకపోవడంతో ఈ అగ్ని మంటలకు కు సంతలో ఉన్న పాకలతోపాటు పక్కనే ఉన్న గడ్డి కుప్పలు కూడా కాలి బూడిదయ్యాయి. మరో రెండు రోజుల్లో వారపు సంత మొదలు కాబోతుంది. అటువంటి సమయంలో ఈ అగ్ని ప్రమాదం ఊహించిన రీతిలో జరగడం గ్రామంలో పెద్ద ఎత్తున చర్చనీయాంసమైంది. వారపు సంతను ఆనుకుని ఉన్న అల్లాడ సత్యనారాయణ, కోసూరి అప్పారావు నివాస గృహాలు ఉన్నాయి. ఈ పాకలకు మంటలు వ్యాపించడంతో ఒక్కసారిగా ఇండ్ల లోనుంచి భయంతో పరుగులు తీశారు. అనుకోని పరిస్థితుల్లో ఇంట్లో నుంచి ఇరు కుటుంబాలు చంటి బిడ్డలను తీసుకొని పరుగులు తీశారు. మంటలు ఎప్పటికీ అదుపు రాకపోవడంతో ఏమి చేయాలో తోచని పరిస్థితుల్లో జాతీయ రహదారిపైకి విషయం తెలిసిన వెంటనే అధికారులు ఇటు గ్రామస్తులు చేరుకొని ఏ విధంగా మంటలను అదుపు చేయాలో అర్థం కాక అటు అందుబాటులో ఫైర్ ఇంజన్ లేకపోవడంతో కొంతసేపు అందరిలో గందరగోళం చోటు చేసుకుంది. హుటా హుటిన విషయం తెలిసిన వెంటనే సిఐ కె. కుమారస్వామి, తాసిల్దార్ ఆర్. నరసింహమూర్తి ,ఎండిఓ దెందుకూరి సీతారామరాజు, టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ,మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, ఉప సర్పంచ్ వీసం రాజు, మాజీ జడ్పిటిసి కొప్పిశెట్టి కొండబాబు, సంత నిర్వాహకులు దేవవరపు కొండలరావు, కళాసిలి సంఘం నాయకులు అద్దూరి అప్పారావు, వీఆర్వో కామరాజు, పంచాయతీ కార్యదర్శి మూర్తి లతోపాటు పలువురు గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేశారు. సీఐ కే .కుమారస్వామి, టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ తో సహా పలువురు హుటాహుటిన ఎలమంచిలి నుంచి ఫైర్ ఇంజన్ ను, హెటిరో నుంచి ఫైర్ ఇంజన్ ను రప్పించి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అప్పటికే పాకలు పూర్తిస్థాయిలో కాలి బూడిద అయ్యాయి. ఫైర్ స్టేషన్ పక్కనే ఉండి సమయానికి అందుబాటులో లేకపోవడంతో పెద్ద నష్టం చోటు చేసుకుందని ఇటు నాయకులు, అటు అధికారులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారిని ఆనుకొని వారపు సంత ఉండటం ఒక్కసారిగా అగ్ని మంటలు వ్యాపించడంతో రహదారంతా పొగ వ్యాపించింది. ముందస్తు చర్యలుగా భావించిన సిఐ కె. కుమారస్వామి, ఏఎస్ఐ సత్యనారాయణ తదితరులు ట్రాఫిక్ ను పక్క దారిలో మళ్లించారు. మంటలను అదుపు చేసేందుకు హెట్టిరో సేఫ్టీ జి ఎం కు ల్లయ్య రెడ్డి స్పందించి ఫైర్ ఇంజన్ ను పంపించడం, ఎలమంచిలి ఫైర్ సిబ్బంది స్పందించిన తీరు పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ అగ్నిప్రమాదం ఏ విధంగా జరిగింది అనేది సీఐ కె. కుమార్ స్వామి ఆధ్వర్యంలో దర్యాప్తు మొదలుపెట్టారు.

సాంప్రదాయ పండుగలకు యువత ముందుకు రావాలి : స్పీకర్ అయ్యన్న

విశాలాంధ్ర-గొలుగొండ: కలతప్పుతున్న సాంప్రదాయ గ్రామీణ పండుగలకు పూర్వ వైభవం తెచ్చే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. బుధవారం గొలుగొండ మండలం లింగంపేట నూకాలమ్మ అమ్మవారిని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ కమిటీ చైర్మన్ కడమంచిలి వరలక్ష్మి దేవాదాయ శాఖ ఈవో దివ్య వేద పండితుల మంత్రోచ్ఛరణ తో అయ్యన్న దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు అనంతరం అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ క్రమేపి కనుమరుగైపోతున్న గ్రామీణ ప్రాంత జాతరలు, పండుగలు, దేవతలు, గురించి నేటి యువతకు అవగాహన లేకుండా పోతుందని అన్నారు . తొమ్మిది రోజులు పాటు జరిగే ఈ నూకాలమ్మ జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు .అలాగే రానున్న శ్రీరామనవమి వేడుకలను నియోజకవర్గంలో ఉన్న 101 పంచాయతీలో అత్యంత వైభవంగా నిర్వహించాలని ప్రజలందరికీ ఆయన పిలుపునిచ్చారు. శ్రీరామ నవమిని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తే పంటలు, ప్రజలు, సుభిక్షంగా ఉంటారని పెద్దలు చెప్పే వారన్నారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని దేవాదాయ శాఖ దివ్యకు మండల ఈ ఓ ఆర్ డి కొరుప్రోలు శ్రీనివాస్ కు సూచించారు. ముందుగా జాతరలో ఏర్పాటు చేసిన వివిధ దుకాణాదారుల కష్టసుఖాలను తెలుసుకుంటూ సతీమణి పద్మావతికి గాజులు, పూజా సామాగ్రిని స్వయంగా అయ్యన్నపాత్రుడు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చిటికెల తారక వేణుగోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, చోద్యం సర్పంచ్ ఆధపురెడ్డి గోపాలకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ కొండమంచిలి వరలక్ష్మి, టిడిపి సీనియర్ నాయకులు చిటికెల సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

సీపీఐ చోడవరం మండల మహాసభలో బాలేపల్లి

విశాలాంధ్ర-చోడవరం : భారత కమ్యూనిస్టు పార్టీ మండల మహాసభ చోడవరం నూకాంబిక కళ్యాణ మండపంలో అనకాపల్లి జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, బడుగు బలహీన వర్గాలు మరియు కార్మికుల హక్కులను కాలురాస్తున్నాయన్నారు. పోరాడితే పోయేది ఏమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అని తెలిపారు. పోరాటంతోనే మన హక్కులను మనం సాధించుకోవాలని అన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి రామానాయుడు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర లేక వ్యవసాయం పూర్తిగా నష్టపోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతే రాజు, రైతు లేకపోతే రాజ్యం లేదని మాటలో చెప్పడమే తప్ప, ఆచరణలేదని అన్నారు. రాజాన దొరబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతుందని సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తానని, ముఖ్యమంత్రి చంద్రబాబు మాటల గారిడి చేస్తున్నారని అన్నారు. రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ ఆటో కార్మికులు కేసులతోనూ, ఎఫ్.సి. చేయకుండా రోడ్లు మరమ్మతులు చేయకుండా, కేసుల మీద కేసులు పెడుతున్నారని, సంవత్సరానికి 10,000 రూపాయలు ఇస్తానని చెప్పి మడమ తిప్పారని అన్నారు. అసంఘటిత కార్మికులకు సమగ్రమైన చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలకు తిప్పికొట్టాలని అని పిలుపు నిచ్చారు. అదే విధంగా కొత్త కార్యవర్గం ఏర్పాటు 11 మందితో ఏర్పాటు చేస్తూ మండల కార్యదర్శిగా సోమాదలదేవి, సహాయ కార్యదర్శిగా విస్సరుపు నాగూర్ ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కీల్లి లక్ష్మయ్య. ద్వారపూడి నాగేశ్వరరావు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మీ సమస్యలను పరిష్కరిస్తా ...

జనవాణిలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్



విశాలాంధ్ర-రాంబిల్లి : నియోజకవర్గంలో గల ప్రజా సమస్యలను తన సొంత సమస్యలుగా భావించి పరిష్కరిస్తానని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలో వెంకటాపురం గ్రామంలో గల ఎమ్మెల్యే పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో ఆయన స్వయంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను తన సొంత సమస్యలుగా బావిస్తున్నానని, త్వరలోనే పరిష్కారం చూపే దిశగా ప్రయత్నిస్తానన్నారు. ప్రతీ గ్రామానికి వచ్చి రోడ్లు, డ్రైనేజీలు,సాగునీటి కాలువలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.అదే కార్యాలయంలో పలు అర్జీలకు అధికారులతో చర్చించి పరిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జయ మాధురి, ఆర్ ఐ రవి కుమార్,ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు పప్పల నూకన్న దొర, టీడీపీ అధ్యక్షులు వి.దిన్ బాబు,ఎంపిటిసి సన్యాసిరావు,మామిడివాడ జనసేన పార్టీ నాయకులు బద్ది మహేష్,కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాలికల చట్టాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర -యస్.రాయవరం: బాలికల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బుధవారం మండలంలో తిమ్మాపురం పంచాయతీలోని బాలికల సంరక్షణ బాల్య వివాహాలు విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ డి.లోవరాజు మాట్లాడుతూ ... బాలికలు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా ఎటువంటి ఇబ్బంది ఉన్న ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లకు ఫిర్యాదు చేయాలని తెలిపారు అలాగే చట్టాలపై కూడా తెలుసుకొని చట్టం ద్వారా పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ స్థానం ఉపాధ్యాయులదే...

ఎంపీపీ బోకం సూర్యకుమారి

విశాలాంధ్ర -నబ్బవరం: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులదే సమాజంలో ఉత్తమ స్థాన మని స్థానిక ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు అన్నారు.మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన కొత్తూరు ఎల్ ఎఫ్ ఎల్ ప్రధానోపా ధ్యాయురాలు డిఎన్ బి కుమారి పదవీ విరమణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిధిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతలో తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులదే అన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు.అనంతరం ప్రధానోపాధ్యాయులు కుమారి దంపతుల ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ పి. పద్మజ, ఎం.ఈ..ఓ లు లక్ష్మణరావు, రవీంద్రబాబు, యు టి ఎఫ్ అధ్యక్ష కార్యదర్శిలు తమ్మారావు, కె వి రమణ, పి ఆర్ టి యూ మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు అప్పల నాయుడు, భాస్కరరావు, ఏ పి టి ఎఫ్ అధ్యక్షులు రెడ్డి ప్రసాదరావు, మండల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి

విశాలాంధ్ర-యలమంచిలి : యలమంచిలి జాతీయ రహదారి రేగుపాలెం జంక్షన్ సమీపంలో తుని నుండి అనకాపల్లి వైపు వెళ్తున్న బైకును అదే రోడ్డులో వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో బైక్ పై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మృతి చెందిన వ్యక్తి రాంబిల్లి మండలం, వాడ నరసాపురం గ్రామానికి చెందిన దానయ్యగా గుర్తించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.
46

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ఎమ్మెల్యే బండారు

విశాలాంధ్ర-వి.మాడుగుల: సమస్యలు పరిష్కారం కోసం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. బుధవారం మాడుగుల ఎంపిడిఓ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు వ్యక్తులు తమ భూములను ఆక్రమించుకున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ వీఆర్వోలు, సర్వేయర్లతో సర్వే చేయించి ప్రతీ ఒక్కరికి న్యాయంచేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మాడుగుల మీదుగా పాడేరు వరకు ఆర్టీసి బస్సులు నడపాలని, దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాలకు చైర్మన్‌లను ఏర్పాటు చేయాలని, డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాజారాం, తహశీల్దార్ రమాదేవి, టీడీపీ మండల అధ్యక్షులు అద్దేపల్లి జగ్గారావు, టీడీపీ నాయకులు వుప్పాల అప్పలరాజు, ఎంపిడిఓ కొంకి అప్పారావు, ఎస్సై జీ.నారాయణరావు అధికారులు పాల్గొన్నారు.

15 లీటర్ల నాటు సారా స్వాధీనం

విశాలాంధ్ర-పాయకరావుపేట: రెండు వేర్వేరు కేసుల్లో 15 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ జి. శ్రీనివాసు తెలిపారు. అరట్లకోట గ్రామంలో ఒక వ్యక్తి వద్ద పది లీటర్లు, గుంటపల్లి - మంగవరం రోడ్డులో ఒక వ్యక్తి వద్ద ఐదు లీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభం

విశాలాంధ్ర-అచ్యుతాపురం : ఉప్పవరం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీన ఉపాధి హామీ పథకం పనులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ కూనిశెట్టి సత్తిబాబు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కార్డు ఉన్న లబ్ధి దారులు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్ కార్డు లేని వారు ధరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీడీఓ ఎరకయ్య , గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు .

ఉద్యానసాగు పెంచేందుకు కార్యాచరణ

- పంటభూమి ఖాళీగా ఉండకూడదు
- వ్యవసాయ శాఖల ద్వారా జిడిపి పెంపు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్ : జిల్లాలో ఉద్యాన పంటల సాగును పెంచేందుకు 15 రోజుల్లోగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుత జిల్లా పరిస్థితులను బట్టి వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా జిడిపి పెంచేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. ఉద్యానసాగు, సూక్ష్మ సేద్యంపై కలెక్టర్ తమ క్యాంపు కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఉద్యాన పంటల సాగు స్థితిగతులు, సూక్ష్మ సేద్యం అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆహార పంటలకే కాకుండా, ఉద్యాన పంటల సాగుకు కూడా అత్యధిక ప్రాధాన్యత నివ్వాలని చెప్పారు. ఉద్యాన పంటల సాగును విస్తరించేందుకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని ఆదేశించారు. ముందుగా అనుగుణమైన నేలను గుర్తించి, ఆయా రైతులను అవగాహన కల్పించి, చైతన్య పరచాలని చెప్పారు. ఈ కొత్త ఆర్థిక సంవత్సరంలో అన్ని పంటల సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచేందుకు తగిన ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. టిష్యూ కల్చర్ అరటి పంటకు ఎంతో డిమాండ్ ఉందని, ఈ ఏడాది కనీసం 500 హెక్టార్లలో అదనంగా వేయాలన్నారు. ముఖ్యంగా జాతీయ, రాష్ట్ర రహదారులకు అనుకొని ఉన్న మండలాల్లో దీనిని విస్తరించడం ద్వారా, మార్కెటింగ్, రవాణాకు అనుకూలంగా ఉంటుందని సూచించారు. హాస్టల్ విద్యార్థులకు అరటిపళ్లను పంపిణీ చేసే అవకాశాన్ని కూడా పరిశీలిస్తామని చెప్పారు. దీనికోసం మండలాల వారీగా అదనపు సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. జిల్లాలో మామిడి పంట విస్తారంగానే ఉందని, దీనిని మరింత పెంచే అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. ముఖ్యంగా సాగు విస్తీర్ణం కంటే, పంట దిగుబడి పెంచడంపై ఎక్కువ దృష్టి పెట్టాలని కోరారు. మామిడి అంటు కట్టడం, పునరుజ్జీవనం తదితర ప్రక్రియలను నిర్వహించేందుకు మండలానికి పదిమంది చొప్పున ఎంపిక చేసి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ విధంగా ఈ ఏడాది అదనంగా కనీసం 1000 హెక్టార్లలో మామిడి పునరుత్పత్తి జరగాలని ఆదేశించారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును పెంచేందుకు విస్తారంగా అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది అదనంగా 1000 హెక్టార్లలో ఆయిల్‌పామ్ తోటలను వేయించాలన్నారు. కొబ్బరి సాగుకు కూడా మంచి అవకాశాలు ఉన్నాయని, ఈ ఏడాది నిర్ణయించుకున్న 400 హెక్టర్ల అదనపు సాగు లక్ష్యాన్ని చేరుకోవాలని చెప్పారు. జీడి పంట సాగును అదనంగా మరో 230 హెక్టార్లకు పెంచాలన్నారు. ముఖ్యంగా జిల్లాలో చిన్నరైతుల సంఖ్య ఎక్కువగా ఉందని, ఉద్యాన పంటల సాగు ద్వారా వీరి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాలని సూచించారు. చిన్న రైతులకు కూరగాయల సాగు, పూల సాగుపై అవగాహన కల్పించి, వాటిని విస్తరించేందుకు ప్రణాళికను రూపొందించాలని చెప్పారు. ఉద్యానసాగును పెంచేందుకు అదనంగా మరో 9 ఎఫ్‌పిఓలను ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలో ఈ ఏడాది అదనంగా 2,500 హెక్టార్ల మేరకు సూక్ష్మ సేద్యాన్ని విస్తరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సిపిఓ పి.బాలాజీ, ఉద్యానశాఖ డిడి జమదగ్ని, ఏపిఎంఐపి పిడి పివిఎన్ లక్ష్మీనారాయణ, ఉద్యాన శాఖాధికారులు, సూక్ష్మ సేద్య ఏఓలు పాల్గొన్నారు.

యాదవ సంక్షేమం కూటమితోనే సాధ్యం

-కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన దూళి

విశాలాంధ్ర-రాంబిల్లి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం యాదవుల సంక్షేమానికి, అభ్యున్నతికి కృషి చేస్తుందని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ సహాయ కార్యదర్శి దూళి రంగనాయకలు అన్నారు. బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వంచే యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన దూళి రంగనాయకులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు,వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు,సమాచార శాఖ మంత్రి కొలుసు పార్ధ సారధి,బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితలు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దూళి రంగనాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటుగా యాదవులకు ఉన్నత పదవులు ఇచ్చి గౌరవించిన చరిత్ర, అన్న ఎన్టీఆర్ కి,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దక్కుతుందన్నారు. తనకు కార్పొరేషన్ డైరెక్టర్ గా పదవినిచ్చిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

లింగంపేట నూకాలమ్మ ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు

ఎస్సై వై తారకేశ్వరరావు

విశాలాంధ్ర-గొలుగొండ : పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు లింగంపేట నూకాలమ్మ అమ్మవారి సన్నిధిలో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని కృష్ణదేవపేట ఎస్సై వై తార్కేశ్వరరావు తెలిపారు. పోలీస్ శాఖ నుండి దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె దివ్య తేజకు నూకాలమ్మ ఆలయం భద్రత పర్యటనలతో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలియజేయడంతో వెంటనే వాటిని ఆలయ ప్రాంగణంలో ఒకటి ఆలయంలోపల మరొకటి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీంతో ఆలయానికి భద్రతపరమైన రక్షణ కల్పించినట్లు అయిందని తెలిపారు.

ఏడు నెలలుగా నిరాహార దీక్ష చేస్తున్న బాధితురాలిని పట్టించుకోని ప్రభుత్వం

- సిపిఐ అనుబంధ ప్రజా మహిళా సంఘాల మద్దతుతో బాధితుల నిరసనలు
- నిరుపేదల ఇళ్ల కూల్చివేతపై భగ్గుమన్న బిజెపి నేతలు

విశాలాంధ్ర-చోడవరం : అనకాపల్లి జిల్లా చోడవరం విఘ్నేశ్వరుని గుడి ఎదురుగా ప్రధాన రహదారిలో నివాసముంటున్న ఓ నిరుపేద కుటుంబం అన్నపురెడ్డి నాగలక్ష్మి ఇల్లు కూల్చివేసిన సంఘటనలో ఏడు నెలలుగా రోడ్డుపై ఓ మహిళ నిరాహార దీక్ష చేస్తున్నను అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో మండల బిజెపి నాయకులు బగ్గుమన్నారు. దీనిపై పలుమార్లు ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు జిల్లా పంచాయతీ అధికారులు (డి.పి.ఎల్.ఓ) విచారణ చేపట్టారు. వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు చోడవరం మేజర్ పంచాయతీ ఈ.ఓ. నారాయణరావు తో కలసి సంఘటన ప్రదేశాన్ని పరిశీలించారు. 'డ్రైనేజీల ఏర్పాటు కోసం' అంటూ పంచాయతీ అధికారులు ఇచ్చిన సమాధానం మేరకు అధికారులు పడగొట్టిస భాదితుల ఇంటిని పరిశీలించారు. సంఘటన స్థలంకు సంభందించిన దస్తావేజులు సమర్పించవలసిందిగా బాధితులను కోరారు. విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిస్తామని, ఏడు నెలలుగా అధికారులు ప్రజాప్రతినిధులు కాలయాపన చేస్తూనే ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో గతంలో తహసిల్దారు ఇచ్చిన పట్టా ప్రాప్తికి ప్రహరీ గోడ నిర్మించేందుకు బిజెపి నేతలు సన్నద్ధమయ్యారు. నిరుపేద బి.జె.పి. కార్యకర్త అయినటువంటి బాధితురాలు నాగలక్ష్మి అనకాపల్లి ఎం.పి. సి.ఎం.రమేష్ కు, తహసీల్దార్ కు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనలో ప్రధాన పాత్రధారుడు, సూత్రధారుడు అయిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, మాజీ ఉప సర్పంచ్ సాగర్, పంచాయతీ కార్యదర్శి నారాయణరావు లను రక్షించేందుకు చోడవరం కూటమి తెలుగుదేశం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు శతవిధాలా ప్రయత్నించారని బి.జె.పి. మాజీ అధ్యక్షుడు బయిన కామేశ్వరరావు ఆరోపించారు. పట్టణ నడిబొడ్డులో ఓ నిరుపేద మహిళ కుటుంబానికి అన్యాయం జరిగి ఏడు నెలల అయినను, స్థానిక ఎమ్మెల్యే రాజు పట్టించుకోపోవడమే దీనికి నిదర్శసమన్నారు. సిపిఐ అనుబంధ ప్రజా మహిళా సంఘాల మద్దతుతో బాధితుల నిరసనలు చేపట్టారు. ముందస్తుగా ఎటువంటి నోటీసు, సమాచారం లేకుండగా మాజీ ఉప సర్పంచ్ సాగర్, పంచాయతీ కార్యదర్శి నారాయణరావులు పేదలపై దౌర్జన్యంకు పాల్పడ్డారని, ఉన్నతాధికారులు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాల తరపున డిమాండ్ చేశారు. అధికారుల అనైతిక

చర్యలు వెనుక రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ శక్తులు కొమ్ము కాస్తున్నారని స్థానికుల ఆగ్రహం చెందారు. బాధితుల వెంట బి.జె.పీ. నాయకులు ఏ.ఆర్.జి శర్మ, దేవరపల్లి చంటి, బయిన కామేశ్వరరావు, మండల అధ్యక్షుడు బుద్ధ అమర్ తదితరులున్నారు.

మూడు లారీలపై రూ. 96వేలు జరిమానా : ఎస్సై

విశాలాంధ్ర-మునగపాక : అనకాపల్లి-అచ్చుతాపురం రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో వెళుతున్న మూడు భారీ వాహనాలను గుర్తించి, వాటికి రూ.96 వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. పూడిమడక రోడ్లో ఎటువంటి అనుమతులు లేకుండా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తే చర్యలు తప్పవని ఎస్సై పి.ప్రసాదరావు హెచ్చరించారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి : ఎంఈవో

విశాలాంధ్ర-రోలుగుంట : బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాలని రోలుగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ జగ్గారావు అన్నారు. హెచ్ఎం ప్రసాద్ సమక్షంలో విద్యార్థులను చేర్చు ఆహ్వాన కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు నమోదు శాతం పెంచే విధంగా ప్రతి గ్రామంలో విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనముగా ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-గొలుగొండ : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎ. ఎల్. పురం లో ఘనముగా ఆటిజం అవగాహన దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి హెచ్ఎం వరలక్ష్మి సమక్షంలో మరియు ప్రత్యేక ఉపాధ్యాయులు తమ్మిల మాణిక్యం ఆధ్వర్యంలో ఘనముగా జరిగాయి మరియు పాఠశాల నుండి ఎ. ఎల్. పురం జంక్షన్ వరకు ఘనముగా ర్యాలీ నిర్వహించి మరియు ఆటిజం అవగాహన దినోత్సవం యొక్క స్లొగన్స్ అందరికీ తెలియ జేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, దివ్యంగ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఏప్రిల్ 2న ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవ సందర్భముగా ఈ రుగ్మత రావటానికి కారణాలు ఏమిటి? దీని లక్షణాలు, ఆటిజం నుంచి చిన్నారులును బయటికి తీసుకుపచ్చేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకురావలో, ఈ పిల్లలకు సైకో థెరపీ, స్పెషల్ ఎడ్యుకేషన్, స్పీచ్ అండ్ లాంగ్వేజ్ థెరపీ, సైకలాజికల్ కౌన్సెలింగ్, పోషకాహారం, ప్రత్యేక శిక్షణ ద్వారా ఆటిజం చిన్నారుల్లో మంచి ఫలితాలు సాధించవచ్చునని తెలియజేశారు. ఆర్‌పిడబ్ల్యూడి యాక్ట్ ప్రకారం 21 వైకల్యాలు లో ఇది ఒక రక వైకల్యం అని తెలియజేశారు. ఈ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వటం ద్వారా సాధారణ విద్యార్థులు వలె రాణిస్తారని, ఉన్నత శిఖరాలు చేరుకుంటారని తెలియజేశారు. ఇన్ ఛార్జ్ హెచ్ఎం వరలక్ష్మి, ఈ పిల్లలు లక్షణాలు తెలియజేస్తూ అందరి సహకారం కావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగముగా దివ్యంగా విద్యార్థులకు పెన్స్, నోట్ బుక్స్, పెన్సిల్ బాక్స్, పండ్లు ఇంచార్జి హెచ్ఎం చేతులమీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యయలు టి.వి.రమణ, రాంకుమార్, రమేష్, దేవుడు, రామరాజు, అచ్చి బాబు, మత్స్య రాజు, బాబు రావు, భారతి మరియు ఇతర ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఎస్ కోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి

విశాలాంధ్ర-వేపాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతుందని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారిఅన్నారు. శృంగవరపుకోట నియోజవర్గానికి సంబంధించి కొత్తవలస వేపాడ, ఎల్.కోట,జామి,ఎస్.కోట మండలాల పరిధిలో నివాసం ఉంటున్న ప్రజల వారి యొక్క సమస్యల సంబంధించిన వినతి పత్రాలుఫిర్యాదులుస్వీకరించడం జరుగుతుందన్నారు.వచ్చిన సమస్యలను అధికారులతో చర్చించి త్వరితగతన పరిష్కరించడం జరుగుతున్నదని తెలియజేశారు.

వాచ్‌మెన్‌కు కెఎన్ఆర్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పరవాడ : పెదముషిడివాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో వాచ్‌మేన్‌గా పనిచేస్తున్న పావడ అప్పలస్వామి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక జనసేన నాయకుడు కరణం నర్సింగరావు (కె.ఎన్.ఆర్) బుధవారం అప్పలస్వాని పరామర్శించారు. ఈ సందర్భంగా అప్పలస్వామి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య ఖర్చుల నిమిత్తం అప్పలస్వామికి కెఎన్ఆర్ రూ.5వేలు ఆర్థిక సాయం చేసారు. భవిష్యత్తులో కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కెఎన్ఆర్ వెంట జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

లింగాలతోట కాలనీలో కోటి రూపాయలతో డ్రైనేజ్ పనులు

విశాలాంధ్ర-పాయకరావుపేట: పట్టణంలోని లింగాలతోట కాలనీలో ప్రజలు ఎప్పటినుంచో ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు కోటి రూపాయలతో పనులు చేపట్టేందుకు హోం మంత్రి వంగలపూడి అనిత చర్యలు చేపట్టినట్టు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను తెలిపారు. ఈ మేరకు వీఎంఆర్డిఏ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు లింగాలతోట కాలనీలో పర్యటించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న డ్రైనేజ్ లు సక్రమంగా లేక వర్షాలు వస్తున్న సమయంలో మురికి నీరు రోడ్ల మీదకు వచ్చి ప్రజల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా లింగాల కాలనీలో పర్యటించిన వంగలపూడి అనిత డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకునేందుకు వి.ఎం.ఆర్.డి.ఏ. ద్వారా కోటి రూపాయలు మంజూరు చేయించారని తెలిపారు. పనులు చేసేందుకు అధికారులు సర్వే చేశారని, త్వరలోనే పనులు ప్రారంభిస్తారని పెదిరెడ్డి శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.ఎం.ఆర్.డి.ఏ. ఎస్.ఈ వి.భవాని శంకర్, ఈ.ఈ. ఎన్. రాంబాబు, డి.ఈ. ప్రసాద్, ఏ.ఈ.నాయుడు, నాయకులు పెదిరెడ్డి నాగ వెంకటరమణ, లెక్కల గోవింద నాయుడు, వీసం మహేష్, దేవాది మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

5న కలెక్టరేట్‌లో బాబూ జగ్జీవన్‌రాం 118వ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-విజయనగరం : స్వర్గీయ మాజీ కేంద్ర మంత్రి, బడుగు బలహీన వర్గాల నాయకుడు బాబూ జగ్జీవన్ రాం 118వ జయంతి వేడుకలను సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 5వ తేదీ ఉదయం 10.30 గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, పలు సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుంది : ప్రగడ నాగేశ్వరరావు

విశాలాంధ్ర-యలమంచిలి : పట్నంలోని తెలుగుదేశం పార్టీ పట్టణ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమస్యలపై రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, యలమంచిలి నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ఫిర్యాదులు స్వీకరించారు. యలమంచిలి మండల, యలమంచిలి పట్టణ కార్యకర్తల సమస్యలను ప్రగడ నాగేశ్వరావు త్వరలోనే పరిష్కరిస్తామని అన్నారు. యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో పెద్దపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త బొద్దపు త్రినాథ్ ప్రమాదవశాత్తు మరణించారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్త భీమా కింద వారి కుటుంబానికి 5 లక్షల రూపాయలను తెలుగుదేశం పార్టీ నుండి యలమంచిలి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు చేతుల మీదుగా వారి కుటుంబానికి అందించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రతి కార్యకర్త తెలుగుదేశం పార్టీ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొలుకులూరి విజయబాబు, జిల్లా అధికార ప్రతినిధి కాండ్రకోట చిరంజీవి, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు గొర్లి నానాజీ, ఆడారి రమణబాబు, క్లస్టర్ ఇన్చార్జిలు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, బొద్దపు శ్రీనివాసరావు, ఆడారి ఆదిమూర్తి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కోటారు సాంబ, మాజీ జడ్పిటీసి రాజాన నారాయణమ్మ, కరణం రవికుమార్, నమ్మి రమణ, గొర్లి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం పరిడవిల్లింది....

- అనాథ వృద్ధునికి ఖలీల్ బాబు చేతులపై అంత్యక్రియలు..
- పదేళ్లుగా ఏటీకే ఓల్టేజ్ హెూంలో ఆశ్రయం పొందుతున్న ఒడిస్సా వాసి బోళా శంకర్
- తొంబై ఏడు ఏళ్ళ వయసులో బుధవారం మృతి..
- హిందూ సాంప్రదాయం ప్రకారం.. స్వర్గధామంలో అంత్య క్రియలు నిర్వహణ

విశాలాంధ్ర-విజయనగరం : ఆయన చూపులు ఎప్పుడూ అభాగ్యులైన అనాథ వృద్ధులను అన్వేషిస్తూ ఉంటాయి. ఆయన హృదయం ఎప్పుడూ వారి కడు దీన స్థితిని చూసి విలపిస్తూ ఉంటుంది. ఆయన గళం ఎప్పుడూ వృద్ధ తల్లిదండ్రులను అనాధులుగా వదిలేయ వద్దని ఘోషిస్తూ ఉంటుంది. ఆయన హస్తం ఎప్పుడూ అనాథ వృద్ధుల సేవలో తరిస్తూ ఉంటుంది. కరుణ, దయ ఆయన కంఠ ఆభరణాలు కాగా, సేవ, సమాజ హితవు ఆయన చేతి భూషణాలు. ఆయనే మహెూన్నత మానవతావాది సూఫీ ఆధ్యాత్మిక, సామాజిక సేవా మార్గదర్శి డాక్టర్ మొహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ సాబిరీ (ఖలీల్ బాబు)." ఒకవైపు తమ తండ్రి సూఫీ మహనీయులు అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా వారి ఆధ్యాత్మిక పరంపరలో నిత్య అన్న సమారాధనను నిర్విరామంగా నిర్వహిస్తూ, మరో వైపు బాబా వారి ఆశయ మార్గదర్శకంలో ఏటికే సంస్థ పేరిట వెలుగు – అనాథ వృద్ధాశ్రమాన్ని స్థాపించి తద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రాంతాలు, రాష్ట్రాలకు అతీతంగా ఎక్కడైనా రోడ్లపై తమకు కనిపించే అభాగ్యులను చేరదీయడం, అనాధులుగా నడి వీధుల్లో విడువబడ్డ వృద్ధులను గుర్తించి వారిని విజయనగరం ఖాదర్ బాబా దర్బార్ ఆవరణలో గల ఏటికే వెలుగు వృద్ధాశ్రమానికి తీసుకు వచ్చి వారిని భోజన వసతితో పాటు వైద్య చికిత్సలు వంటి సేవలు అందించడం ఖలీల్ బాబు దైనందిన చర్య. అంతేకాకుండా తమ ఆశ్రమంలో చనిపోయిన వృద్ధులకు తానే కొడుకుగా వారి వారి ఆచారాల ప్రకారం అంత్య క్రియలు నిర్వహించి వారి అంతిమ యాత్రను ఘనంగా నిర్వహిస్తూ ఆ వృద్ధుల పట్ల తనకున్న అమితమైన ప్రేమానురాగాలను చాటుకుంటున్న ఖలీల్ బాబు తాజాగా మరోసారి తన మానవతా హృదయాన్ని ఆవిష్కరించుకుని సమాజానికి ఆదర్శంగా నిలిచారు. ఏటికే

వెలుగు అనాథ వృద్ధాశ్రమంలో ఒడిశాకు చెందిన భోళా శంకర్ అనే తొంబై ఏడేళ్ళ వృద్ధుడు పదేళ్లుగా ఆశ్రయం పొందుతున్నారు. ఆయనకి తన సొంత కొడుకులా ఖలీల్ బాబు సేవలు అందిస్తూ ఎంతో మమకారంగా చూసుకున్నారు. ఐతే వృద్ధాప్యం వల్ల కలిగిన అనారోగ్య సమస్యలతో వృద్ధుడు భోళా శంకర్ బుధవారం సాయంత్రం స్వర్గస్తుడయ్యారు. దీంతో అతడితో ఉన్న తన అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఖలీల్ బాబు కన్నీటి పర్యంతమయ్యారు. ఆయన భౌతిక కాయానికి ఘనంగా అంత్య క్రియలు నిర్వహించాలని సంకల్పించారు. ఆశ్రమం నుంచి ఒక ప్రత్యేక వాహనంలో దాసన్న పేట స్వర్గధామానికి ఆశ్రమ సేవకులు, బాబా భక్తులతో కలిసి వృద్ధుడు భోళా శంకర్ భౌతిక కాయాన్ని తరలించారు. అక్కడ అతడి హిందూ ఆచార సంప్రదాయం ప్రకారం తానే ఒక కుమారునిలా వృద్ధుని చితికి నిప్పంటించి తన మానవత్వాన్ని మరోసారి చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖలీల్ బాబు తనయుడు అహమ్మద్ బాబు, దర్గా ముజాఫర్ బాబా, ఖాదర్ బాబా భక్తులు, సేవకులు రంగారావు బాబాయ్, డాక్టర్ పీవీ గోపాల రాజు మాష్టర్, జుజ్జూరు ఖాదర్, నాగూర్ , జర్నలిస్ట్ ఖైరాజ్, జ్ఞానేశ్వర్, నాయుడు, స్వామి, సూరిబాబు, నాగేశ్వర్ మాష్టర్, రాము, శ్యామ్ తదితరులు భోళా శంకర్ భౌతిక కాయానికి నివాళులర్పించారు.